క్లుప్తంగా

స్వచ్ఛతపై ప్రతిజ్ఞ



మాట్లాడుతున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు: స్థానిక డీఆర్ఎం కార్యాలయంలో ఇండిపెండెన్స్ డే కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్వచ్ఛతపై ఉద్యోగులతో డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ ఆదర్శంగా ఉండాలన్నారు. అలాగే నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కమిషనర్ పర్యటన

తాడిపత్రి రూరల్: పట్టణంలోని గాంధీనగర్‌లో శుక్రవారం మునిసిపాలిటీలోని వివిధ శాఖల అధికారులతో కమిషనర్ శివరామక్రిష్ణ పర్యటించారు. వార్డులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం కొళాయి నుంచి వచ్చే నీటిలో క్లోరిన్ శాతాన్ని పరికరంతో పరిశీలించారు. నీటి సమస్య గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు.

మఠం స్థలం ఆక్రమించారంటూ ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పట్టణంలోని శ్రీశైల జగద్గురు సూర్యసింహాసన మఠానికి సంబంధించిన స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించారంటూ మఠం అభివృద్ధి మండలి సభ్యులు శుక్రవారం తహసీల్దార్ రమాదేవికి ఫిర్యాదు చేశారు. మఠం స్థలంలో కొందరు ఇంటి నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారని, వెంటనే విచారణ జరిపి మఠం స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ కుమార పండితారాధ్య స్వామీజీ, అభివృద్ధి మండలి కార్యదర్శి జీపీ మంతకల్ రెడ్డి, బండారు రమేష్, మఠం మేనేజర్ మాలప్ప తదితరులు వినతిపత్రం అందజేశారు.

సూపర్‌వైజర్ల అంతర్గత బదిలీలు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి ఐసీడీఎస్ పరిధిలోని తాడిపత్రి పట్టణం, మండలం, పెద్దపప్పూరు మండలాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లను శుక్రవారం సీడీపీఓ సాజిదాభేగం అంతర్గత బదిలీలు చేశారు. చుక్కలూరు, ఆర్‌వీపల్లి సెక్టార్లకు లక్ష్మీదేవి, పట్టణంలోని ఆసుపత్రిపాలెం, మండలానికి ఉమ, పెద్దపప్పూరు, ముచ్చుకోట సెక్టార్లకు విజయను బదిలీ చేశారు. పలు ఆరోపణలు రావడంతో పాటు ఫిర్యాదుల మేరకు వారిని సీడీపీఓ బదిలీ చేశారు.

'కాలనీకి రోడ్డు నిర్మించండి'

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని జడ్ వీరారెడ్డి కాలనీకి రోడ్డు నిర్మించాలని సీపీఎం, ఐద్వా, డీవైఎఫ్ఐ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు విన్నవించారు. గుత్తిలోని జంగాల కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేను వారు కలిశారు. కాలనీకి వెళ్లడానికి రోడ్డు సరిగా లేదని, వర్షాల సమయంలో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, ఐద్వా మండల నాయకురాళ్లు రేణుక, రేవతి, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్, నాయకులు హరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాలగంగాధర్ తిలక్‌కు నివాళి



పెన్షనర్ల భవనంలో తిలక్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు బాల గంగాధర్ తిలక్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అబూ బకర్, అదనపు కార్యదర్శి కుళ్లాయిబాబు తదితరులు తిలక్ చిత్ర పటానికి పూల మాల వేసి, నివాళులర్పించారు. బాల గంగాధర్ తిలక్ దేశానికి చేసిన సేవలను వివరించారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో శుక్రవారం ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ తెలిపారు. గ్రామంలో ఆధార్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్ నమోదు, సవరణలు, అడ్రస్ మార్పు తదితర సేవలను ప్రజలు వినియోగించుకోవచ్చన్నారు.

పాలనలో చంద్రబాబు ఘోర వైఫల్యం

- మాజీ మంత్రి శైలజానాథ్ ధ్వజం
- రీకాలింగ్ చంద్రబాబుకు స్పందన



చంద్రబాబు మోసాలను మహిళలకు వివరిస్తున్న మాజీ మంత్రి శైలజానాథ్

బుక్కరాయసముద్రం/నార్పల/గార్లదిన్నె/యాడికి/పుట్లూరు/తాడిపత్రి టౌన్/పెద్దపప్పూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా పేద ప్రజలకు ఒక్క పథకం కూడా ప్రవేశ పెట్టలేదని, పాలనలో సీఎం చంద్రబాబు ఘోరం విఫలం చెందారని శింగనమల నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి శైలజానాథ్ ధ్వజమెత్తారు. శుక్రవారం బీకేఎస్ మండలంలోని సిద్ధరాంపురం, కొండాపురం, గ్రామాల్లో ఇంటింటికీ చంద్రబాబు మోసం–మోసపూరిత హామీల రీకాలింగ్ కార్యక్రమం పార్టీ మండల అధ్యక్షులు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శైలజానాథ్ హాజరయ్యారు. ఆయన ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వివరించారు. చంద్రబాబు దాదీ పాలనలో ప్రజలకు బాకీ పడిన పథకాలు నష్టాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు కూటమి మేనిఫెస్టో అంటూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆర్భాటంగా హామీలు గుప్పించారన్నారు. అయితే ఒక్క పథకం కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. చంద్రబాబు పాలనపై దృష్టి పెట్టకపోగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతూ కేసులు బనాయిస్తూ జైళ్లకు పంపడం సిగ్గుచేటన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన గుణ పాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పార్వతి, నాయకులు జగదీశ్వరరెడ్డి, కొండన్న, నాగముణి, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శివచ మల్లేష, చంద్ర, పూల నారాయణస్వామి, నరేష్, లక్ష్మిరెడ్డి, చికెన్ నారాయణస్వామి, ఆది, కాటమయ్య, మంత్రి అంజి, బయపరెడ్డి, వరికూటి కాటమయ్య, లక్ష్మి నారాయణ, రంగా, భాస్కర్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

- నార్పల మండలంలోని గూగూడు, ముచ్చుకుంటపల్లి, గంగనపల్లి, తుంపెర గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి(అనంతపురం పార్లమెంట్) నార్పల సత్యనారాయణరెడ్డి హాజరై ప్రజలకు చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఖాదర్‌వలీఖాన్, జెడ్పీ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు వలంటీర్స్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి జయరామిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, ఎంపీటీసీ రాజారెడ్డి, నాయకులు శివశంకర్‌రెడ్డి, శివయ్య, వెంకటనారాయణరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, వెంకటరెడ్డి, ఎంఎస్ నాయుడు, రమణయ్య, వెంకటస్వామి, మనోహర్, పక్కీరెడ్డి, కుళ్లాయిరెడ్డి, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- గార్లదిన్నె మండలంలోని పెనకచెర్లడ్యాం, పెనకచెర్ల, పి.కొత్తపల్లిలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎల్లారెడి, శింగనమల నియోజకవర్గ ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ ఆర్టీఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు, పెనకచెర్ల సర్పంచు బచ్చలన్న, నాయకులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు, నారాయణస్వామి, రామచంద్రారెడ్డి, జయరాం, నాగలింగారెడ్డి , హేమ సుందర్‌నాయుడు, బాలిరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.
- యాడికి మండలంలోని యాడికి, నగరూరు, భోగాలపట్టు , రాయలచెరువు గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, నగరూరు సర్పంచు రుక్మాందర రెడ్డి, భోగాతి బ్రహ్మానందరెడ్డి, బాలా రమేష్ బాబు, వైఎస్సార్ సీపీ విభాగం జిల్లా కార్యదర్శి తలారి నాగేష్, దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర గౌడ్, నాయకులు ఆదినారాయణ రెడ్డి, యోగానంద రెడ్డి, విజయకుమార్ రెడ్డి, ప్రసాద్, నాని, వెంకటక్రిష్ణారెడ్డి, శ్రీనివాస రెడ్డి, శివ శంకర్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, ప్రసాద్, నాగరంగయ్య, నాగేశ్వరరెడ్డి, శ్రీరామ రెడ్డి, హనుమంత రెడ్డి, రామాంజనేయులు, చిన్న పుల్లయ్య, కంబగిరి రెడ్డి, సుబ్బారెడ్డి, రామాంజి, చౌడయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.
- పుట్లూరు మండలంలోని కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి గ్రామాల్లో శుక్రవారం 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు నరసింహులు, జేసీ రామాంజనేయులు, నాయకులు విష్ణు నారాయణ, నాగేశ్వరరెడ్డి, రామమోహన్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సాంబశివారెడ్డి, ఎల్.శేఖర్, రమణారెడ్డి, శివరామిరెడ్డి, కొమ్మ రాజశేఖర్‌రెడ్డి, ఎస్.రామమోహన్‌రెడ్డి, సూరి, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.
- పెద్దవడుగూరు మండల కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శరభారెడ్డి ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శేషారెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటస్వామిగౌడ్, సోషల్‌మీడియా కన్వినర్ బ్రహ్మానందరెడ్డి, క్రిష్ణారెడ్డి, శివారెడ్డి, హరి, శ్రీరాములు, నాగరాజు, జ్ఞాని, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.
- పెద్దపప్పూరు మండలంలోని గార్లదిన్నెలో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు హేమసుందర్‌రెడ్డి, నాయకులు అమర్‌నాథరెడ్డి, కమలాకర్ రెడ్డి, ఆలూరు నారాయణరెడ్డి, కొండారెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెద్దపప్పూరు మండలం గార్లదిన్నెలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నార్పల మండలం గూగూడులో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



గార్లదిన్నె మండలం పెనకచెర్ల డ్యాంలో రీ కాలింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



యాడికి మండలం నగరూరులో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



పుట్లూరు మండలం గరుగుచింతలపల్లిలో రీ కాలింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పెద్దవడుగూరులో రీకాల్‌చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పీఎస్‌వీ రమణరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. తమ కళాశాలలో డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్ (డీసీఈ) డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్ (డీఎంఈ), డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (డీఈఈఈ), డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ వెహికల్ వాహన బృందం ప్రత్యేకత (డీఈఈఈవీటీ) కోర్సుల్లో జాయిన్ కావడానికి ఈ నెల 4లోపు దరఖాస్తు చేసుకోలన్నారు. 5వ తేదీ ఉదయం 9.30 గంటలకు అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 7075932669, 8328471880, 9441576517, 9440982411, 9949746112 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన డైరెక్ట్ స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శివరామక్రిష్ణ తెలిపారు. పాలిసెట్ రాయని విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదో తరగతిలో వచ్చిన మార్కులు ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. ఈ నెల 4లోపు అప్లికేషన్ అందజేసి పేరు నమోదు చేయించుకోవాలన్నారు. 5వ తేదీ ఉదయం 10 గంటలకు అడ్మిషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జతలు జిరాక్స్ సెట్లు, 3 ఫొటోలతో హాజరు కావాలన్నారు. కళాశాలలో సివిల్స్, ఎలక్ట్రికల్(ఈఈఈ) ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్(ఈసీఈ) బ్రాంచ్‌లలో సీట్లు ఉన్నాయన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలోని ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాలలో వివిధ తరగతుల్లో మిగులు సీట్లకు ముస్లిం, మైనార్టీ, దూదేకుల కులానికి చెందిన అర్హులైన విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 5వ తరగతిలో 24, 6వ తరగతిలో 2, 7వ తరగతిలో 4, 8 వ తరగతిలో 4 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సర్టిఫికెట్లతో పాఠశాల వద్దకు వచ్చి అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అందజేత



అభిరామ్‌కు ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న హెడ్‌కానిస్టేబుల్

గుంతకల్లు: ఓ విద్యార్థి పోగుట్టుకున్న ల్యాప్‌టాప్ బ్యాగును వెంటనే గుర్తించి అందజేసిన ఘటన శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో చోటు చేసుకుంది. వివరాలు..కర్నూలు జిల్లా మద్దికెర మండలం జొన్నగిరికి చెందిన విద్యార్థి అభిరామ్ బెంగుళూరులో బీటెక్ చదువుతున్నాడు. శుక్రవారం అభిరామ్ బెంగుళూరు వెళ్లడానికి గుంతకల్లు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నాడు. బస్సు రాగానే ల్యాప్‌టాప్ బ్యాగును సీటులో వేశాడు. బస్సు బయలుదేరే సమయంలో ఎక్కి సీటులో చూసుకుంటే బ్యాగు కనబడలేదు. వెంటనే అక్కడే విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ బాబామున్వర్‌కు ఫిర్యాదు చేశాడు. బ్యాగులో రూ.40 వేలు విలువచేసే ల్యాప్‌టాప్‌తోపాటు సర్టిఫికెట్లు, పర్సులో కొంత నగదు ఉన్నాయని తెలిపాడు. టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్‌కు హెడ్‌కానిస్టేబుల్ ఈ విషయాన్ని తెలియజేశాడు. వెంటనే బస్టాండ్‌లో ఉన్న సీసీ కెమెరాల్లోని పుటేజ్‌లను పరిశీలించగా ఓ వృద్ధుడు బ్యాగు తీసుకెళ్లినట్లు గుర్తించారు. బస్టాండ్ సమీపంలోని మద్యం షాపు వద్ద వృద్ధుడి దగ్గర నుంచి బ్యాగును తీసుకుని అభిరామ్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ బాబా మున్వర్‌ను టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ అభినందించారు.

నేడు 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'

గార్లదిన్నె: శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకె శైలజానాథ్ ఆదేశాల మేరకు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు యర్రగుంట్ల, ముకుందాపురం గ్రామాల్లో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎల్లారెడ్డి తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీ టీసీ, సర్పంచులు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు.

ముర్రు పాలతో పిల్లలకు ఆరోగ్యం



గుత్తి ఆర్ఎస్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



శింగనమల మండలం తరిమలలో అవగాహన కల్పిస్తున్న వైద్యుడు శంకర్ నాయక్

గుత్తి/శింగనమల/యల్లనూరు: పిల్లలకు తల్లి పాలు ఎంతో శ్రేష్టమైనవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. గుత్తి ఆర్ఎస్‌లోని సుందరయ్య కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేశారు. సూపర్ వైజర్ మాట్లాడుతూ తల్లి పాలలో ఉన్న పోషకాలు బిడ్డ ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. డబ్బా పాలు తాపించడం వల్ల పిల్లల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పార్వతి, నాగలక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- శింగనమల మండలంలోని తరిమెల పీహెచ్‌సీలో గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యుడు శంకర్‌నాయక్ మాట్లాడుతూ మొదటి ఆరు నెలలు తల్లి పాలు తప్పనిసరిగా అందించాలన్నారు. తల్లి పాలు లేకపోతే అనంతపురంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని తల్లి పాల బ్యాంక్‌ను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రేస్ లలితమ్మ, సూపర్‌వైజరు నాగమ్మ, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.
- యల్లనూరు మండలవ్యాప్తంగా శుక్రవారం నుంచి 7వ తేదీ వరకూ నిర్వహించే తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని సూపర్‌వైజర్లు రాజామణి, శాంతమ్మ తెలిపారు. శుక్రవారం యల్లనూరు సెక్టారులో వేములపల్లి, తిమ్మంపల్లి సెక్టారులో తిమ్మంపల్లి 3వ సెంటర్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు. అలాగే తిమ్మంపల్లి పీహెచ్‌సీలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వైద్యురాలు కీర్తన, సూపర్‌వైజర్ రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకోవాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న రోటరాక్ట్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులు చదువుతో పాటు సేవా దృక్పథం అలవర్చుకోవాలని రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ కేశవరెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో రోటరీక్లబ్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేశవరెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువులతో పాటు సామాజిక సేవా రంగాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కళాశాలలో రోటరాక్టర్ అధ్యక్షుడిగా హర్ష (సివిల్ ఇంజినీరింగ్) గంగాధర్ (ఈఈఈ) కార్యదర్శిగా, పలువురిని మెంబర్లుగా ఎంపిక చేశారు. అనంతరం రోటరాక్ట్ క్లబ్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రోటరాక్ట్ క్లబ్ అధ్యక్షురాలు భార్గవిరెడ్డి, అనంతపురం సెంట్రల్ రోటరీక్లబ్ అధ్యక్షుడు గల్లా హర్ష, కోశాధికారి అరవింద్‌కుమార్, సుశీల, నాగలక్ష్మి, లక్ష్మి నారాయణ, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మురికి కాలువల్లో అబేట్ మందు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

యాడికి: ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న నంబర్ 2 సచివాలయం పరిధిలోని కాలనీలో ప్రజలు మలేరియా, డెంగీ బారిన పడకుండా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరి సరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం వైద్య, ఆరోగ్య సిబ్బంది మురికి కాలువలు, ఇళ్లలోని నీటి తొట్టిలో అబేట్ మందును పిచికారీ చేశారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే తనిఖీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాం ప్రసాద్ గౌడ్, ఏఎన్ఎం విజయ మేరీ, ఆశా వర్కర్లు సులోచన, సుబ్బలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

కేబుల్ చోరీపై కేసు నమోదు

పుట్లూరు: మండలంలోని మడ్డిపల్లిలో కేబుల్ చోరీపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యబాబు తెలిపారు. గ్రామానికి చెందిన ఐదుగురు రైతులు తమ పొలాల్లోని విద్యుత్ మోటర్లకు అమర్చిన కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జీఆర్‌పీ డీఎస్పీగా శ్రీనివాస ఆచారి



గుంతకల్లు: గుంతకల్లు జీఆర్‌పీ డీఎస్పీగా కే.శ్రీనివాస ఆచారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆరు నెలల కిందట గుంతకల్లు జీఆర్‌పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ గుంటూరుకు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి గుంతకల్లు జీఆర్‌పీ డీఎస్పీ పోస్టు ఖాళీగా ఉంది. అయితే ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలు సిటీలో దిశ పోలీసు స్టేషన్ డీఎస్పీగా ఉన్న శ్రీనివాస అచారిని గుంతకల్లుకు బదిలీ చేయడంతో ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైలు ప్రయాణికుల భద్రతే లక్ష్యంతో సిబ్బందిని అప్రమత్తం చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న దళితులు

పామిడి: మండలంలోని కండ్లపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని దళితుల భూముల్లో ఇసుక అక్రమ రవాణా చేపట్టడమే కాకుండా కులం పేర దూషణ చేసిన ఎద్దులపల్లి అగ్రవర్ణాల వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఉషారాణికి శుక్రవారం బాధిత రైతులు జెన్నే వన్నూరు. జెన్నే మల్లికార్జున, జెన్నే సుబ్బరాయుడు, జెన్నే అంకాలప్ప వినతిపత్రం సమర్పించారు. కండ్లపల్లి గ్రామ సర్వేనెంబర్–2బీలోని దళితుల భూముల్లో ఎద్దులపల్లి గ్రామవాసులు పులికంటి ఉమామహేశ్వర్‌రెడ్డి, కొండూరు రమణారెడ్డి జేసీబీతో వంద దాకా ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేపట్టారన్నారు. అడ్డుకోబోయిన దళితులను బెదిరించాన్నారు. వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు. లేనిపక్షాన కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి, పోరాటం చేస్తామన్నారు.

'విద్యుత్ భారం తగ్గించాలి'

గార్లదిన్నె: కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారం మోపకుండా వెంటనే తగ్గించాలని ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు శ్రీనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఇంటికి బిగిస్తే ప్రజలు పగులకొట్టాలన్నారు. అలాగే ఇప్పటికే ఇళ్లకు బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలన్నారు. సర్దుబాటు విద్యుత్ చార్జీల విధానం రద్దు చేయాలన్నారు. ఈ నెల 5న సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే ఆందోళన కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యులు కావాలన్నారు.

నెరవేరని 'స్వచ్ఛ' లక్ష్యం



మండీబజార్ వాటర్ ట్యాంక్ ఆవరణలో మూలన పెట్టేసిన రోడ్డు స్వీపింగ్ మిషన్

గుంతకల్లుటౌన్: స్వచ్ఛభారత్–స్వచ్ఛాంధ్ర లక్ష్యాలు మున్సిపల్ శానిటేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరుగారుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లను శుభ్రం చేసేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన రెండు రోడ్డు స్వీపింగ్ మిషన్లకు చిన్న మరమ్మతులు చేయించలేక మూలన పడేశారు. అధికారులు స్వీపింగ్ మిషన్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఆయిల్ మిల్ ప్రహరీ ధ్వంసం.. కేసు నమోదు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద కాశీ విశ్వేశ్వర దేవాలయం సమీపంలో ఉన్న వేరుశనగ ఆయిల్ మిల్ ప్రహరీ ధ్వంసం చేసిన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు.. నగరంలోని వేణుగోపాల్‌నగర్‌కు చెందిన ప్రభాకర్ గత 20 ఏళ్లుగా కాశీ విశ్వేశ్వర దేవాలయం సమీపంలో ఆయిల్ మిల్ నిర్వహిస్తున్నారు. అక్కడ స్థల విషయమై ప్రభాకర్‌కు మామిళ్లపల్లికి చెందిన చెన్నారెడ్డి మధ్య కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. ఇరు వర్గాల వారు కోర్టుకు వెళ్లారు. ఇందుకు సంబంధించి తనకు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా చెన్నారెడ్డి వర్గీయులు దౌర్జన్యంగా జేసీబీతో ఆయిల్ మిల్ ప్రహరీ ధ్వసం చేశారని బాధితుడు ప్రభాకర్ పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: రైతులు పంటలు సాగు చేసే సమయంలో భూసార పరీక్షలు చేయించు కోవాలని రెడ్డిపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర సూచించారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో ఏరిస్ ఆగ్రో సంస్థ ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై విద్యార్థులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల సాగు మందు రైతులు భూమిని బాగా దుక్కి చేసుకోవాలన్నారు. అధిక దిగుబడులు సాధించాలంటే తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రావా ఏజెన్సీ ప్రతినిధి పద్మ, ఏరీస్ ప్రతినిధి అబ్దుల్ రహ్మాన్, రాధిక, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.